కాలజ్ఞాన సౌజన్య పత్రికలు

కాలజ్ఞానము

1వ సౌజన్య పత్రిక

(శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారి సంసార గృహమందు పుట్టపై పీఠములో పరీధావి సంవత్సర (1912) కార్తిక బ౧౩లు శుక్రవారం రోజు పూజారి రామయ్యగారు పూజ చేయుచుండగా వారికి కన్పించిన కాలజ్ఞాన తాళపత్రము).

ఈ పత్రిక రక్తాక్షినామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ౧౦లు నాడు ఉత్పత్తి అయినది. కనుక బదరికాశ్రమమందున్న మహాఋషులు, యోగులు, మునులు, మహాపురుషులు వీరయోగి, రామయోగి, నాగయ్య, శివచిదంబరస్వామి మొదలైన ఘనులు ఆనతి యిచ్చినారు. కనుక మహానంది శ్రీశైలపర్వతము మీద తపస్సు చేసి ముప్పదిమూడు కోట్ల దేవతలచేతను, మహామునులతోడను వరము తీసుకొని సిద్ధప్ప, అక్కనాగమ్మ, కనకదుర్గాంబ ఈ మొదలైనవారు ఆశ్వయుజ శుద్ధ౧౦లు దశమినాడు నందికొండకు ప్రవేశించినారు. ఇక కొంతకాలమునకు భూమి పరిపాలన చేయవత్తురు అని ముగ్గురు మూర్తులకు (త్రిమూర్తులు) సెలవు ఇచ్చినారు. ఇక తడవు లేదు. త్వరగా వచ్చేరు గనుక ఈ వృత్తాంతము వ్రాయవలసి వచ్చెను. ఇంకా వెనుక మంచి కవితలు వ్రాయించి పంపిస్తూ ఉన్నాము. ఓ మానవులారా! మీరు పాపకార్యములకు జడియకుండా ఉన్నారు. ఇంకా ఒకచిత్రము పుట్టీని. క్రోధినామ సంవత్సరము మొదలుకొని ఉత్పాతాలు పుట్టీని. ఢిల్లీవారు తరలి ఆనెగొందికి చేర వచ్చెదరు. ఎర్రవారిని ఏనుగులచేత త్రొక్కించును. తొమ్మిదిమూరల ఆజానుబాహులు వచ్చేరు. అందరిని పట్టి కోసేరు. ఆకాశమందు వాక్కు వాక్కుమని శబ్దము పుట్టీని. ఆకాశమందు నాల్గుచుక్కలు ఎర్రగాను, ఎద్దు ప్రకాశముగా ఒకటి వెళ్ళివచ్చిన అవి చూచినవారు వెతపడి చచ్చేరు. దక్షిణమందు ఒక వింత పుట్టీని, పడమట మార్గమందు ఉత్పాతము పుట్టీని. ఢిల్లీవారు తరలి ఆనెగొందికి చేరవచ్చెదరు. అదివరనుండి ఉరుములు, పిడుగులు పడును. తూర్పు మార్గమున ఉత్పాతమైన శక్తితల ధూళియై పొయ్యీని. అవ్యయమైన వృక్షం వచ్చేననిపించి, వింత వింతలు చూపి ముగ్గురుమూర్తులు వచ్చేరు. మూలబ్రహ్మము అప్పుడు వచ్చీని. కులగోత్రాలు

వేదశాస్త్రములు వచ్చీని. షణ్మతాల నామం కలవారు ప్రతిష్ఠకు వచ్చేరు. శాపం నిలిచి చేరుదురు.నగరపాటికి ఉత్తర భాగమందు ఒకఋషి పుట్టీని. ఆయనతో కూడ అనేక ఋషులు పుట్టెదరు. ఆకాలమందు దివారాత్రిళ్ళు లేకుండను అక్కడ పుట్టే ఉత్పాతములు లెక్కలేదు. దక్షిణమందు మెరసీని. ఉత్తరమందు ఉరిమీని. పిడుగులు పడును. అష్టదిక్పాలకులు అల్లకల్లోలమై, దేశములు తల్లడిల్లి, రాజులు రాజ్యములు విడచి, ప్రజలు పరభూములకు చేరుదురు. తల్లి ముఖము బిడ్డ, బిడ్డ ముఖము తల్లి చూడక నష్టమైపోదురు. ఈశాన్య దిక్కునుండి విషపుగాలి వచ్చీని. విప్రులు మూర్ఛలు పొయ్యేరు. వింత వింతలు పుట్టీని. అప్పుడు శివుని కంట మిణుగులు రాలును. పార్వతి నయనాల నీళ్ళు కారీని. శ్రీశైల శిఖరమందు నిప్పులు ధ్వని రాగా విని ఆశాకమంతయు వాక్కుమనే ధ్వని పుట్టీని. వీరభోగవసంతరాయులని దినం పిలుస్తూ వచ్చీని. పల్లెలపట్నాల రక్తవర్షం కురిసీని. వీరభోగవసంతరాయలు భూలోకానికి వచ్చే కాలమందు పుట్టే కార్యాలు అమావాస్యనాడు చంద్రోదయ మయ్యీని. పుష్పముల వాన కురిసీని. అవిచెప్పి స్త్రీలు నదులలో జోలలు పాడెదరు. భూమి నిరామయంగా ఉండే కాలమందు తండ్రి బిడ్డలకు, అన్న చెల్లెండ్రకు, అత్తలల్లుండ్రకు శ్మశానమందు లగ్నం నిశ్చయం చేసినారు. దక్షిణ మార్గం నుంచి ఒక వైష్ణవుడు పుట్టివచ్చును. జనుల సంహరించును. పాశాంకుశాలు విలిచికొని ఎనిమిది మూలల కత్తి పట్టని మహాత్ముల పట్టి కట్టి కోసేరు. అగ్నిలో వేదం పుట్టీని. అగ్నిలో లేచిన వారు వచ్చేరు. హరబ్రహ్మం విముక్తి అయ్యీని. గంగోదకం కురియును. అయిద్దాయివారి ప్రమాణం గెలిచీని. అయిదేండ్ల నాగయ్య వేదము చదివీని. రాజులతో వియ్యమందేరు. పెండ్లికొడుకును చేరవచ్చేరు. విజయ నగరం విస్తరించీని, బనగాని పల్లె మహాపట్టణ మయ్యేను. ఈ ప్రకారం కాబోవుచున్నది గనుక ఆయోగం విచారించి వ్రాయవలసి వచ్చును. ఇంకా ఒకనాడు అకాలశక్తి పుట్టును ; భూమి మీద నడుచును. మట్టి మిద్దెలు కలిగినవారు మారణమై పొయ్యేరు, ప్రజలు కూర్చున్నవారు కూర్చున్నట్లు పడుకొన్నవారు పడుకొన్నట్లు మాట్లాడేవారు మాట్లాడుతునూ ముఖాన నోటిలో పుండ్లు పుట్టి చచ్చేరు. ఈలాగున నష్టమైపోదురు. ప్రజలు ఆకురాలినట్లు రాలుదురు. భూమి మీదనున్న నిర్జితుల ధనం శ్రీశైల పర్వతము మీద చేరును. నరులలో వైరము మీద తర్కము పడును. పంచముఖబ్రహ్మ అప్పుడు వచ్చును. వారితో సంభాషించును.

తిరుగా రాయలు సింహాసనం చేరబోయేను. ముగ్గురు నరులకు గండకత్తెర ప్రమాణం చేయవలసి వచ్చును. పదివేలముగ్గురు పరబ్రహ్మ వంశమందు ఏక అవుపాసనతో పట్టుబడుదురు. వీరభోగవసంతరాయలు అహోబిళమునందు ఉత్పత్తి అయ్యీని. పుణ్యపురుషులు హెచ్చరికపడి దారి తెలుసుకొని మార్గంబు పట్టుకొని ఆజాతకానికి చేరవచ్చేది. కాలముసంఖ్య ఇంకామీకు తెలియదు.చూచినవారు చూచినట్లు, విన్నవారు విన్నట్లు స్త్రీలు బాలురతో లేచివచ్చేది. రాక గర్వాంధకారులై యుంటే వికారస్వరూపమైన శక్తివచ్చును.అందరిని దుప్పులు చేయును. తరిమి తరిమి కొట్టును. కొట్టి కొట్టి కోయును. అగ్నిస్నానం చేయించును. అంభోయని అరపించును. లేనిబాధలు పెట్టును. ప్రయాస చేయును. యమబాధలు వచ్చును. ఏటిలో బడద్రోయును. శిఖరము వెళ్ళదీయును. పంచశక్తులు వచ్చును. అప్పళించి మ్రింగును. నల్లగాలి వచ్చును. ఆమీదట బొబ్బలు పుట్టును. అష్టాదశ వర్ణాలవారు ఒక్క చోట నీళ్ళుతాగుదురు. నాల్గుజాతులవారు ఒక్కజాతియై యుందురు. ఈలాగున కాబోవుచున్నది యోగం తెలుసుకునే వారు తెలుసుకొని హెచ్చరిక పడి వస్తూ ఉండేది. వచ్చిన వారికి యమబాధలు తప్పును. పుణ్యపురుషులై గురుచెంత చేరుదురు. వారికి యమబాధ లుండవు. పాపాత్ములకు చింతలు పుట్టును. పుణ్యాత్ములకు భక్తి పుట్టును. దోషులకు అపోహలు తోచును. అమ్మలక్కలు అంతా వింతలై యుందురు. ఇందుకు సందేహము లేదు. ఆ వీరభోగవసంత రాయ లుండే క్రమము చెప్పేము. సువర్ణచ్ఛాయ బోలినవారు, విభూతి తిలకము ధరించినవారు, యోగదండము పట్టినవారు. కావివస్త్రాలు ధరించినవారు, వజ్రాల పాదుకలు తొడిగినవారు - మూలబ్రహ్మం. అతడు పుణ్యపురుషుడు. నూట ఎనిమిది సంవత్సరములు రాజ్యపాలన చేయును. వారిసాంప్రదాయకము వారు వెయ్యి ఏండ్లు ఏలుదురు. ఇందుకు సందేహము లేదు. పూర్వము నడచిన యోగఫలము సమసిపోయి స్వకార్యాలు చెప్పేము. అప్పుడు పరబ్రహ్మ వంశము ప్రఖ్యాతి చెయ్యవలెనని ఆదికాలమందు కాశిలో ఉత్పత్తి అయివచ్చును. భూమిలో నున్న వంశమువారిని ప్రఖ్యాతి చెయ్యవలెనని బెంగుళూరు అయ్యఅనే మహాత్ముడు శాపమిచ్చె గనుక ఇంతమటుకు జరిగెను. ఆ పుణ్య పురుషుడు నూటతొమ్మిదిఏండ్ల మూడు దినములున్ను అతిఘోరమైన తపస్సు చేసి శాపం విముక్తి చేసుకుని సమస్తము

పంచముఖ బ్రహ్మయై భూమి పరిపాలన చేయవస్తూ ఉన్నాడు. ఇందుకు సందేహం లేదు. ఈ మహత్వము ఎవ్వరైనను హాస్యము చేసిన వారికి వచ్చే కీడు చెప్పేము. వంక శిఖలవారు వచ్చేరు. వచ్చినవారు చూతురు, పట్టి పట్టి కోసేరు. అట్టహాసము చేసేరు. వీరగురుని ప్రార్థన చేసేరు. వీరబ్రహ్మము అప్పుడు వచ్చును. మూర్ఖుల ముక్కు కోసేరు. ముప్పు తిప్పలు పెట్టేరు. గట్టిగా మానవులు మ్రగ్గేరు. కొంకనక్క వచ్చేని. వచ్చి మానవుల మెక్కేని. బండిమీద కోడి వచ్చేని. దాని రెక్క విసరుకు లక్షలు చచ్చేరు. దానికూతకు కులక్షయమై మానవులు గట్టిగా మ్రగ్గేరు. ఇందుకు సందేహము లేదు. ఇకనైన జ్ఞానము తెలుసుకొని కనుగొని యుండేది. ఈ మహత్వం అయిన పత్రిక బ్రహ్మ క్షత్రియ వైశ్య, శూద్రాదులు మొదలైనవారు ఈ పత్రిక చూచిన తక్షణమందు కన్నుల కద్దుకొని ధూప, దీప నైవేద్యాదులనుంచి వడపప్పు పానకము చేయించేది. పంచ వాద్యాలతో కూడ నాలుగువీధులు ఊరేగింపు చేయించేది. బదులు పత్రికలు వ్రాసియుంచుకొని ఆవల గ్రామాదులకు పంపించేది. శుక్రవారం సముద్ర స్నానం చేసి ఆ సముద్రతీరమందున్న మహాశక్తి శక్తి దర్శనం చేసుకొని తిరుగా వచ్చి యొక విభూతిపండు ఒక కలశము పెట్టి హోమగుండం త్రవ్వుకొని యీ పత్రికలగుండా పూజలు చేస్తూ ఉన్నారు. ఎవ్వరు పూజలు చేస్తారో వారిని రక్షింతుము. చేయనివార్ను అక్కధర్మము చేయనివారు. దానధర్మాలు చేయనివారిని అక్క నాగమ్మ విచారించును. ధర్మం చేసినవారు, ఒకరిని దూషించనివారు, ఒకరి సొమ్ముకు ఆశపడని వారు పుణ్యపురుషులై యుందురు. ఇందుకు సందేహము లేదు. భగవత్ ధ్యానసంపన్నులై యుండేది.

సమాప్తము

2వ సౌజన్య పత్రిక

(శ్రీప్లవనామ సంవత్సర (1961) చైత్ర శుద్ధ౺లు సౌమ్యవారం పగలు 3 గం॥లకు కందిమల్లాయపల్లె శ్రీవిరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి జీవసమాధి ఉత్తర భాగమున స్వామివారి పాదుకా సన్నిధానమున మఠాధిపతులు శ్రీ శ్రీనివాస స్వాముల వారికి లభించిన తాళపత్రము)

ముందు ఒకనాడు దేవలోకమందు ముప్పదిమూడుకోట్ల దేవతలున్ను, నలువది తొమ్మిదివేల మునులున్ను, గరుడ, గంధర్వ, సిద్ధ, విద్యాధరులున్ను, సత్యరాగ, వీరభద్రస్వామిన్ని, ద్వాదశాదిత్యులున్ను వీరు మొదలగువారిని పిలువనంపించి దేవేంద్రుడు ఆజ్ఞాపించిన వైన మేమంటే -

ఓ దేవతలారా! ముందు భూలోకములో పాపము మూడు పాళ్ళున్ను పుణ్యము ఒక పాలున్ను నడుస్తూఉన్నది. దుష్టు లధికమై ధన మదాంధతచేతనున్ను గర్వాభిమానులై పెద్దతనం తెలియక నీతిదప్పి దుర్నీతులై వావివర్తనలు లేక గర్వించి యున్నందుకు ఇందుకు యోచన ఏమి చేస్తూ ఉన్నారని అడుగగా ఇంద్రునితో సురలు విన్నవించిన వైనం ఏమంటే ఓ దేవేంద్రా! నీకు తెలియని యోచన మాకు ఏమి తెలియును కనుక? అయితే మాకు తోచినంత మాత్రం విన్నపం చేస్తూ ఉన్నాము. దయచేసి వినరయ్యా! కలియుగంలో ఇదివరకు ఎక్కువ పాపం లేదు. ఇప్పుడు దుష్టులు అధికమైనందున వాండ్లను శిక్షించను ఒక పుణ్య పురుషుణ్ణి పుట్టించకుంటే భూమి నిలువనేరదని దేవతలందరు చెప్పగా విని దేవేంద్రుడు సమ్మతించి దేవతలను వెంటబెట్టుకొని వైకుంఠమునకు పోయి శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారికి సాష్టాంగ నమస్కారములు చేసి స్వామీ! పరశురామా! ఆదిమధ్యాంత రహితా! అఖిలాండకోటి బ్రహ్మాండనాయకా! భూమిలో దుష్టు లధికమై నందున చిన్నతనం పెద్దతనం తెలియక నీతిదప్పి దుర్ణీతులై శ్వేతముఖుల రాజ్యం అయిపోయి నందున భూలోకం నిలువనేరదు. పైగా కలియుగ ప్రమాణము 4 లక్షల 32 వేలు

కనుక ఇదివరకు చెల్లిపోయినది. 4 వేల 992 ఆయెను. ఇంతలోగా పాపముమూడు పాళ్ళున్ను పుణ్యము ఒక పాలున్ను అయినది. కాబట్టి భూదేవి ఓర్వలేక దేవత లందరూ చెప్పగా విని శ్రీమన్నారాయణమూర్తి చెప్పినవైనం ఏమంటే - నేను భూలోకమున కాశ్మీరదేశం ఏలే జయసింగు మహారాజుకున్ను పుత్రుడనై జన్మించి దుష్టులందరిని పరిహారం చేస్తూ ఉన్నాను. మీరందరు మాకు జయప్రదం కోరండి. ఇదిగాక సాంబశివుడు చిదంబర దీక్షితుల వారున్ను, రామయోగి అయ్యవారున్ను అవతరించినారని చెప్పగా విని సాదృశ్యంగా దుష్టనిగ్రహ శిష్ట పరిపాలన చేసే నిమిత్తం కనకదుర్గాంబను పుట్టించి వారివారికి వినిపించి తమనిజస్థానములకు పొమ్మని, తాను కాశ్మీరదేశం ఏలే జయసింగు మహారాజుకు అతని భార్య తిలకమాంబ అనే మహాపతివ్రతకును పుత్రుడనై జన్మించెదను. అప్పుడు నవగ్రహములు శుభస్థాన మందు ఉందురు. వారి శరీరం పులకింప మూర్తిమంతు డాయెను. కాళయుక్తినామ సంవత్సరము మకరరాశియందు ఈశాన్య దేశానకు గౌతమీ తీరం కేదారిక వనములో ఒక ఉత్పత్తి బిలము ఆయెను. ఆబిలములో ఈ బాలుండు దిగి అక్కడనున్న మహాత్ముల నందరిని దరిసెనం చేస్తూ నిలబడి యుండగా మహాత్ములు కనులు దెరచి చూచి ఈ బాలుండు ఎవరోయని యోగదృష్టి నిదానించి చూచి ఆదినారాయణమూర్తి ఈ ప్రకారం అవతరించినారని తెలిసి సంతోషాంతరంగులై వారిని పూజించి ఓయీ ! రాచకుమారుడవు నీవు ఈ భూలోకము ఏలే కొరకు నారాయణాంశము చేత కాశ్మీరదేశం ఏలే జయసింగు రాజుకున్ను ఆతని భార్య తిలకమాంబ అను మహాపతివ్రతకున్ను, పుత్రుడై జన్మించి ఏనూరుకోట్ల భూమండలం ఏలే ఏకచ్ఛత్రాధిపతివై యేలబోతూ ఉన్నావు. నీనామధేయం ఏమంటే వీరభోగ వసంతరాయలు అని చెప్ప విని ఓ మునులారా? నామీద కటాక్షించి సకల విద్యలు, చెప్పన్నారు భాషలు, ధనుర్వేదాది విద్యలు నేర్పమని అడుగగా ఆమునులు సంతోషించి సకలవిద్యలు నేర్పిస్తూ ఉండిరి. అంతట కొండిరాయములో రామ నగరమందు మునుకోటి అగ్రహారములో రామయోగి పుట్టి పెరుగుతూ ఉండెను. ఒకనాడు రామయోగి అయ్యవారి సముఖానకు వచ్చి (చిదంబర దీక్షితులు) పూజించి నమస్కారము చేయగా ఓయీ చిదంబర దీక్షితులవారు ఈ భూమి పరిపాలనము చేసే నిమిత్తార్థమై అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుండైన శ్రీమన్నారాయణమూర్తి

కాశ్మీర దేశం ఏలే జయసింగు రాజుకున్ను అతని భార్య తిలకమాంబ మహాపతివ్రతకు పుత్రుడైజన్మించి ఈశాన్య దేశమున సకలవిద్యలు నేరుస్తూ ఉన్నాడని నాతో నారదమహాముని చెప్పినాడు గనుక మనమందరమున్ను అవ్వారి సముఖానకు పోయి అక్కడున్న దివ్య తేజోవంతుడైన బాలుని జూచి వత్తమని వారిద్దరు బదరికాశ్రమమునకు బోయి అక్కడనున్న దివ్యతేజోవంతుడైన బాలుని జూచిరి. ఈ బాలుడు భూమండలము ఏలేకొరకు వీరభోగవసంతరాయలున్ను, రామయోగి అయ్యవార్లున్ను, చిదంబర దీక్షితులవారున్ను మీరు మువ్వురు మూడు రూపంబుల అవతరించినారు. చైత్రశుద్ధ సోమవారంనాడు రాత్రి నేను లేచి వస్తూన్నాను, నేను లేచి వచ్చేవరకు పాపాత్ములందరు నష్టమైపోదురు. శ్రేష్ఠులు మాదరిసెనం చేసుకొని సుఖంగా ఉందురు. పాపాత్ములు ఎలాగు నష్టమైపోదురంటే అన్యోన్య కలహములచేత నశింతురు. కొండల శిఖరము మీద మంటలు కనిపించును. ఇదిగాక ఒక ఉత్పాతమైన కనకదుర్గాంబను పుట్టింప దానిచేత కొందరు నశింతురు. గుళ్ళలోనున్న దేవతల కనుల్లో ఉత్సవము లధికమౌను. గ్రామాదుల మీద నాట్యమాడుదురు. ఆలాటి వేళల్లో పాపిష్ఠుల మనస్సు చంచలమగును. మల్లికార్జునస్వామి జనులతో ఇష్టాంతరముగ మాట్లాడును. అట్లా కొందరు నశింతురు.వీరభోగవసంతరాయలు భూమి పాలించవస్తాడని జనులు ఆడుకొందురు. వడగండ్ల వానలు అధికమై కురియును. అందువల్ల కొందరు నశింతురు. కాంచీపురి కామాక్షమ్మ దక్షిణరాజ్యం జనుల నష్టం చేయును. కర్నాటకదేశానికి కాళికా దేవిన్ని, తుంగకారణ్యానకు దుర్గిన్ని, అరవదేశము నకు వీరభద్రుడు, నందిరాజ్యమునకు నాగేంద్రుడు, బాలురు మొదలుకొని వృద్ధుల పాపాత్ములను నష్టం చేయును. అర్ధరాత్రివేళ కాకులు కూయును. వింతలు అధిక మవును. దుష్టులనోళ్ళలో మల్లెలు (పురుగులు) పడిచత్తురు. పగలు ఆకాశాన చుక్కలు కన్పించును. నాల్గు దిక్కులున్ను ఆకాశాన అంధకారమై ధ్వని వినబడును. అందున కొందరు నశింతురు. నక్కలు, పమిడికంటెలు రాత్రి పగళ్ళు కూయును, నీళ్ళలో జలజంతువులు అన్నియును భూలోకానికి వచ్చి చస్తిమని కూయును. అందున కొందరు నశింతురు. శ్రీశైలమునకు ఒక మొసలి వచ్చి భ్రమరాంబ గుడిలో మేకకూత కూసి మరుగై పోవును. అందున కొందరు నశింతురు. శక్తులు బెబ్బులులై ప్రజల కరచి చంపును, కుమారస్వామి గుడి తలుపులు తీసినా రాకుండా మూసుకొని

యుండును. విషపుగాలిచేత కొందరు నశింతురు. సూర్యమండలము నుండి ధణధణమని భూమిలో పడును. మల్లికార్జునస్వామి కన్నులలో నిప్పులు రాలును. బసవేశ్వరుడు గడగడ వణకును. ఆకాశాన దేవతలు పలుకులు పలుకుదురు. వారి వారి వాక్కుల శబ్దము పుట్టును. అందున కొందరు నశింతురు. వారి వారి వాక్కుల శబ్దము పుట్టును. అందున కొందరు నశింతురు. కొక్కిరాయలు ఏలూరు అరణ్యములో నష్టమై పోవును. తిరుపతి వెంకటాచలపతి గుళ్ళో మ్లేచ్ఛులు చొరబడుదురు. కపిధ్వజంలో ఝూంకారనాదము పుట్టును. జగమంతయు వణకును. గరుడధ్వజం విరిగి నలుదిక్కులకు పడును. తిరువళ్లూరు వీర రాఘవస్వామికి చెమటలు పట్టును. జగమంతయు నష్టమై పోవును. లక్ష్మీదేవి కన్నులలో నీరు కమ్మును.వినాయకుని మంత్రం ఊర ఊర చదువుదురు. నీళ్ళలో స్త్రీలు జోలపాడుదురు. కనుల్లో రక్తము కారును. దండిస్థలాలన్ని తురకల పాలై పోవును. పెద్ద పెద్ద తురకలంతా పెద్ద పెద్ద గోరీలు కట్టుదురు. సమస్త జనులంతా వీరబ్రహ్మము గారి చరిత్రములో తగులుదురు. అమావాస్యనాడు చంద్రుడు పుట్టును. ఆకాశము ఎర్రనగును. అష్టాది గోకర్ణంబులు ఆజ్యమిచ్చును. పట్నాలలో గ్రామాలలో వనములలో రక్త వర్షము కురియును. పట్నాలలో లక్ష్మీదేవి దుఃఖించును. వీరభోగవసంతరాయలు వస్తున్నాడని భూదేవత పలుకును. సముద్రాలు ఉప్పొంగును. వెనుక ముందర ఏ ప్రకారం ధర్మం నడిచెనో ఆ ప్రకారం ధర్మాలు నిండా నడుచును. సకల వర్ణములవారు సంతుష్టులై యుందురు. ఈ బాలుండు ఇక్కడికి వచ్చి ఆరునెలలు ఆయెను. ఇక్కడ మూడునెలలుండి కేదారి ఉపదేశించి సాంబశివుని గూర్చి రెండునెలలు తపస్సు చేసి అతని చేత మూడు వరములు తీసుకొని ఇంద్రకీలాద్రికిపోయి మహాత్ముల దరిసెనం చేసుకొని గంగాతీరమందు చేరి తమ వంశకర్తలైన ధర్మరాజాదుల ముద్రికలు గైకొని తొంబై అయిదు సంవత్సరములు రాజ్యపరిపాలన చేసుకొని ఏకచ్ఛత్రాధిపతియై రాజ్యము నేలును. భూలోకం పరిపాలన చేసుకొని ఏకచ్ఛత్రాధిపతియై రాజ్యము ఏలును. భూలోకం పరిపాలన చేసేటందుకు వస్తాడు. ముందు దుష్టులు నష్టమై పోదురు. మిగిలిన పుణ్యపురుషులు ధర్మము నడుచుకుంటూ సుఖంగా నుందురు. అటు తర్వాత నెలకు మూడు వర్షాలు కురియును. పైర్లు పంటలు అభివృద్ధిగా నుండును. ధర్మము నిండుకొని సుఖంగా నడుచును. నాల్గు జాతులవారు లెస్సగా నుందురు.

సకల భోగభాగ్యులై సుఖంగా ఉందురు. ఈ సౌజన్య పత్రికను భూమిమీద ఎవరు ప్రబలం చేస్తూ ఉన్నారో వారు సౌభాగ్యములు కలిగి వర్ధిల్లుదురు. ఈ పత్రికను వ్రాయక పాలుమాలి గర్వించిన సకల పాపంబులు సిద్ధించును. ఈ పత్రిక ఎవరు కోడిగం (హాస్యం) చేస్తూ ఉన్నారో, వారినోట్లో వజ్రదొండి పురుగులు పడును. ఓయీ చిదంబర దీక్షితులవారు రామయోగి అయ్యవార్లున్లు మేము చెప్పిన మాటలు తెలుసుకునేది. ఎంచగల మహిమలన్ని చూస్తిరిగదా? ఈ లోకములో నున్న ప్రజలంతా విన్నారు గదా. ఈ పత్రికను ఎవరు ఆక్షేపణ చేస్తూ ఉన్నారో వారిని కనక దుర్గాంబ ఖండించును. శక్తులకు ఆహుతి ఇచ్చును. భూమండలము మీదికి వ్రాసి పంపించినామని బ్రహ్మంగారు ఆజ్ఞాపించినారు. కనుక మహాఋషులున్ను, మహా పురుషులున్ను ఆజ్ఞాపించినందువల్ల మేము భూలోకములో నున్న పుణ్యపురుషులైన వారికి తెలియచేసే కొరకు ఈ సౌజన్యపత్రిక వ్రాసి పంపించినాము. మీరంతా జ్ఞానము వహించి నాభక్తులై యుండవలసినది. ఈ పత్రికను శ్వేతముఖులు చూచి మమ్ములను పట్టుకరమ్మని మావద్దకు వారి దూతలను పంపించినారు. కనుక వారి దూతలు మావద్దకు వచ్చి మమ్ములను పిలువగానే మేము యోగదృష్టితో నిదానించి చూచి, శ్వేతముఖులు బలిష్ఠులై యున్నారు. కనుక వారితో చెప్పరాదని వారివద్దకు పోతిమి. వారు మమ్ములను చూచి 'మీరు మాకు ఎట్లు వ్రాసి ఎంపించినారు? అయితే భూలోకానకు' దైవము ఎవరని అడుగగా ' ఇపుడు సాంబశివుడు ప్రత్యక్షమై చెప్పి నారు. మీకున్న దైవమేకదా' అన 'మేము దైవమే' యని చెప్పినాము. కనుక బ్రహ్మము గారైతే మేము ఒక విధము చేస్తూఉన్నాము. దానికి నిలువమని అడిగిరి. ఆ ప్రకారము చేయమంటిమి. మామీద జోడుఫిరంగిగుండ్లు కాల్పించినారు. రెండు ఫిరంగిగుండ్లు మా హస్తాలను పూలచెండ్లయి తాకెను. అది చూచి శ్వేతముఖులు భయపడి పారి పోయిరి. ఆ సమయమందు మహాఋషులున్ను, మహాసిద్ధులున్ను, దేవతలందరు వచ్చి చిదంబరులు భగవద్భక్తులని తెలియక శ్వేతముఖులు వింతచేసినారు. అయితే ఇప్పుడు వారికి కైలాసము ఇప్పించ మని అడుగగా ఇట్టి దుర్బుద్ధులు పుట్టించినందున వారికి హతమయ్యే కొరకు కాబట్టి యీ వర్తమానం యావత్తు భగవద్భక్తులైన వారికి పుణ్య పురుషులైన వారికి తెలియవ్రాసినాము. సిద్ధార్థి నామ సంవత్సర ఆషాఢ శుద్ధ సప్తమి శుక్రవారం నాడు 3వ పత్రిక ఉత్పత్తి

ఆయెను. ఈ పత్రికను పుణ్యపురుషులైన వారు చూచుకొనేది. పోతులూరు వీరబ్రహ్మన్ని నాలుగు వీథులు ఊరేగింపు చేసి జ్ఞాన మార్గంగా ఉన్నకోర్కెలు ఇవ్వనాయెను. ఈ పత్రిక హాస్యం చేసినవారిని కనక దుర్గాంబ దండించును. నేనున్నూ ఆ దేశానికి రెండవ నెలలో వస్తున్నాను. ఈ ప్రకారం ఎవరు పూజలు చేస్తూ ఉన్నారో వారికి పుష్ప మిచ్చిన జోడు పుష్పము లవును. వారి ఇంటిలో రెండు వింతలు అగుపడును. ఈపత్రికను వ్రాయక పాలుమాలి చదువక ఊరికెయున్న కనకదుర్గాంబ దండించును. గ్రామ గ్రామ గ్రామమునకు ఈ పత్రిక వ్రాసుకొని పూజలు చేయవలసినది. నామీద భక్తికలిగి యుండవలసినది. ఏమో వ్రాసినారని మీరు మరచి యుండవద్దు. ఈ పత్రికను తీసుకొని వచ్చిన భక్తులను గ్రామములోనికి పిలుచుకొని పోయి ఆభక్తునకు భత్యము ఇచ్చి మఠానికి దక్షిణయిచ్చి పంపవలసినది. ఈ ప్రకారం యోగులున్ను మహా పురుషులున్ను బ్రహ్మముగారున్ను సాంబమూర్తిగారున్ను ఆజ్ఞాపించినారు. జగత్తు మీదికి వ్రాసి పంపించినాము. ఈ పత్రికను పూజ చేసినవారు ఆయురారోగ్యైశ్వర్య వస్తువాహనములు కలిగి యుందురు.

చిదంబర దీక్షితులున్ను, రామయోగి అయ్యావార్లున్ను బ్రహ్మము గారున్ను వ్రాయించిన కాలజ్ఞాన పత్రిక.